# IMMANUEL BIBLE COLLEGE

**Christianpet NIDUBROLU**








## రెవ. డేవిడ్ కోని

## Rev. David Koenig

# నిరీక్షణ

# HOPE

## పరిచయం: (Introduction

చార్లెస్ డికెన్స్ అను ఒక ఆంగ్లనవలారచయిత పిప్ అను ఒక యువబాలుని గురించి "గ్రేట్ ఎక్స్పెక్టేషన్" అను పుస్తకం వ్రాశాడు. ఈ బాలుడు తన జీవితంలో గొప్ప అంచనాలను అందుకొనుటకు అనేక సంక్షోబాలనుండి మరియు కష్టాలనుండి ప్రయాణిస్తాడు. అలాగే సంక్షోబాలతో, ఇబ్బందులతో మరియు కష్టాలతో మన జీవితం నిండిపోయినా క్రైస్తవులుగా మనం జీవితంలో గొప్ప అంచనాలు కలిగి ఉండాలి. అయినా మన అంచనాలన్నిటిని మించి మనముగింపు గొప్పఆనందం మరియు కీర్తితో కూడుకొనిఉన్నది. పాతనిబంధనలోను మరియు క్రొత్తనిబంధనలోను 'హోప్' అను ఆంగ్లమాటకు అర్ధం 'నిరీక్షణ' అనిఅనువదించబడినది. పైనచెప్పబడిన పిప్ అను బాలుడు తనజీవితంలో తన నియంత్రణలోలేని పరిస్థితులలో ఉన్నమాదిరిగా మనంకూడా మన జీవితంలో సమస్యలతో మరియు సంక్షోబాలతో చుట్టుముట్టబడినా వాస్తవమైయున్న క్రీస్తు మరియు ఆయన సాధించన అద్భుత విజయం మనకు ఇచ్చిన సుస్థిరమైన హామి ద్వారా మనం నిరీక్షణ కలిగి ముందుకు పోవాలి అనే దానిని మనం ఈ వ్యాసంలో ధ్యానించ బోతున్నాము. అయినా మనకు అన్ని కూడా దేవుని నియంత్రణలో ఉంచబడి యున్నవి కారణం దేవునికి అసాధ్యమైనది ఏది లేదు మరియు అన్నికూడా ఆయన స్వాధీం కనుక, అంతిమంగా మనకు ఆయన ద్వారా అంతా మంచే జరుగబోతుంది. మరణించిన తరువాత మనం మధ్యాకాశంలో అందుకోబోతున్న "విందు" గురించి కమ్యునిష్టులు క్రైస్తవులను ఎగతాళి చేస్తున్నారు. చివరకు మన వ్యతిరేకులు ఎంతో నిరాశకు గురికాబో తున్నారు కాని దేవుని గొప్ప వాగ్దానం ప్రకారం మనం ఆశించినదానికంటే ఎక్కువే మనం పొందుకోబోతున్నాము.




**యేసు రక్తం మరియు ఆయన నీతిమీద నా నిరీక్షణ నిర్మించబడింది తప్ప మరి దేనిమీదకాదు.**
**ఈ లోక తీయదనాలను నేను నమ్ముటకు ఇష్టపడక కేవలం యేసునామంమీదనే నేను పూర్తిగా ఆనుకుంటాను**
**నేను నిలబడింది, క్రీస్తు అనబడిన ఒక స్థిరమైన బండమీద, మిగతాదంతా మునిగిపోయేటి ఇసుక భూమి! టి.ఎల్.హెచ్ 370-1**

## ప్రేమ: (Love)



"యెహోవా దృష్టి ఆయనయందు భయభక్తులుగలవారి మీదను ఆయన కృప కొరకు కనిపెట్టు వారి మీద నిలుచుచున్నాది." కీర్తన 33:18 మయందు దేవునికి ఉన్నగొప్ప ప్రేమమీద మనయొక్క నిరీక్షణ ఆధారపడియున్నది. ఆయన ప్రేమ కాలక్రమేణా తగ్గిపోయేదికాదు అదేవిధంగా మన నిరీక్షణ కూడా. మన నిరీక్షణను ఏతుప్పుకూడా కప్పివేయలేదు మరియు తగ్గించలేదు. మనయొక్క విశ్వాసం దృష్ట్యా చూస్తే మనకున్న నిరీక్షణ బూజుపట్టేదికాదు మరియు ఏపాత్రలో పోస్తే ఆపాత్రకు తగ్గట్టుగా ఆకృతిని మార్చుకొనేదికాదు. వాస్తవంగా చూస్తే ఎక్కువకాలం మనం క్రైనస్తవులుగా ముందుకు సాగేకొలది ఆ నిరీక్షణ మనయొక్క మనోనేత్రాలలో ఇంకా ఎక్కువగా మెరిసిపోయే విధంగా ఉంటుంది.

"ఏలయనగా మనము నిరీక్షణ కలిగినవారమై రక్షింపబడితిమి. నిరీక్షింపబడునది కనబడునప్పుడు, నిరీక్షణతో పని యుండదు, తాను చూచుచున్న దానికొరకు ఎవడు నిరీక్షించును? మనము చూడనిదానికొరకు నిరీక్షించిన యెడల ఓపికతో దానికొరకు కనిపెట్టుదము." రోమా 8:24-25. పరలోకములో మనకొరకు దాచియుంచబడిన స్వాస్థ్యములు మనము చూడలేకపోయినా యేసుక్రీస్తు మన కొరకు శిలువలో చనిపోయి సమాధి చేయబడి తిరిగి లేచుట అను వాస్తవాన్ని మనము లేఖనముల ద్వారా స్పష్టముగా చూడగలము. అంతే కాకుండా పరలోకములో మనకొరకు ఎదురుచూస్తున్న ఆధిక్యతలు మన ఊహకు మించిన సంతోషకరమైనవని దేవునిద్వారా గ్రంధస్థం చేయబడిన విషయాల ద్వారా దీనిని మనము పూర్తిగా అర్ధం చేసుకొనగలము. శిలువలో మన కొరకు ఏర్పాటు చేయబడిన దేవుని అద్భుత ప్రేమను చూస్తే, పరలోకములో మనకొరకు దాచబడిన వాటి విషయములో దేవుడు ఎన్నడు విఫలం చెందడని ఖచ్చితంగా మనము చెప్పగలము.

"జనముల వ్యర్ధ దేవతలలో వర్షము కురిపించగల వారున్నారా? ఆకాశము వాన నియ్యగలదా? మా దేవుడవైన యెహోవా, నీవేగదా దాని చేయుచున్నావు? నీవే ఈ క్రియలన్నియు చేయుచున్నావు, నీకొరకే మేము కనిపెట్టుచున్నాము." యిర్మీయా



14:22. దేవుని తీర్పు ఈ భూమిమీద భయంకరంగాపడే సమయంలోకూడా మానవుల యెడల దేవుని యొక్క దయ అనుదినం కూడా నూతనంగా ఉంటుందని యిర్మీయి తన గ్రంథంలో వేరొక చోట చెప్పాడు. రోజువారి చిన్నచిన్న విషయాలలోకూడా అనగా ప్రేమగలిగిన సంరక్షణ, మార్గదర్శకత్వం మరియు ఇచ్చుటలోనుకూడా దేవుని హస్తమును మనముచూడగలము. అతిగొప్ప విషయాలలోను మరియు అత్యల్ప విషయాలలో కూడా ఆయన అన్ని విధాలుగా చక్కగా సహాయం చేయువాడుగా ఉన్నాడు. చేతిలోని పక్షి పొదలోని రెండు పక్షులకంటె మేలని, విలువఎక్కువ అను నానుడిని నిజమని ఈ లోకంలో మనం మన బలహీనతల వలన అనుకుంటాం. కాని పరలోకంలో కనిపించని మరియు మనకొరకు ఉంచబడిన స్వాస్థ్యములు ఈలోకంలో మనకున్నవాటికన్నా ఎంతో విలువైనవని నిరీక్షణ మనకు చెప్పుచున్నది. పరిస్థితులపై నమ్మకంలేక మనకున్న విలువైన వాటిని మనం ఎప్పుడు తాకి చూచుకోవాలని, భద్రంగా దాచుకోవాలని మనం మన భయాలను బట్టి అనుకుంటాం. అయితే అదృశ్యుడైన దేవుని యందు విశ్వాసముంచుట అనగా ఆయన తన ప్రేమను బట్టి మనకొరకు పరలోకంలో దాచియుంచినవాటిని మనం హృదయపూర్వకంగా నమ్ముటయే. నిరీక్షణద్వారా మనంపరలోకంపై మనదృష్టిని కేంద్రీకరించిన ఈలోక విషయాలను సమర్థవంతంగా భరించగలం. అయితే ఈ లోకవిషయాలపై మనం దృష్టి కేంద్రీకరించినట్లయిన క్షీణించిపోవుట మరియు పతనమగుట ప్రారంభం. కనుక శిలువను తిరిగి దృష్టించి, నిత్యత్వంలో ప్రభువుతో కూడ నివసించుటపై నిరీక్షణయుంచుట ఎంతో మేలు.




పరలోకమందు మన నిరీక్షణ యుంచబడినదని కొలస్సీ 1:3-5లో దేవుని వాక్యమువలన చెప్పబడుచున్నది. అందువలననే మనం అను దినం దేవుని వాక్యమును ధ్యానించవలసిన అవసరమున్నది. అన్యజనులలో ఈ మర్మముయొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో అది, అనగా మీయందున్న క్రీస్తు, మహిమ నిరీక్షణయైయున్నాడను సంగతిని దేవుడు తన పరిశుద్ధులకు తెలియపరచగోరెను. కొలస్సీ 1:27. అంతే కాకుండా మన హృదయాలలో క్రీస్తు యేసు ఉన్నప్పుడు ఆమహిమ నిరీక్షణను మనము కలిగిఉండగలం. ఆహా! క్రైస్తవునిగా ఉండుట ఎంత గొప్ప ఆనందం.

**ప్రభు ప్రియ ముఖాన్ని చీకటి కప్పివేసినా, మార్పులేని ఆయన కృపపైన నేను ఆనుకొనెదను:**
**ప్రతి గొప్ప తుఫాను గాలి అలలు ఎదురైనా తిరుగులేని ఆయన నీడపై నాలంగరు వేసెదను:**
**నేను నిలబడింది, క్రీస్తుఅను బండమీద, మిగతాదంతా మునిగిపోయే ఇసుక నేల. టి.ఎల్.హెచ్ 370 చరణం 2.**

## సంతోషం: (Joy)




ప్రతిఒక్కరు సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. అయితేసంతోషంగా ఎలాఉండాలో కొద్దిమందికి మాత్రమేతెలుసు. మనలంగరు ప్రభువుపై ఉన్నదిగనుక శ్రమ, ఇబ్బందిమరియు సంక్షోభ నేపధ్యంలో కూడా మనం సంతోషంగా ఉండగలం. "మరియు ఆయనద్వారా మనము విశ్వాసమువలన ఈ కృప యందు ప్రవేశముగలవారమై, అందులో నిలిచియుండి, దేవుని మహిమను గూర్చిన నిరీక్షణను బట్టి అతిశయపడుచున్నాము. అంతేకాదు, శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమలందు అతిశయపడుదుము. ఎందుకనగా ఈనిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరిచబడియున్నది." రోమా 5:2-5. పరలోకములో మనకొరకు ఉంచబడినదానినితో ఇక్కడ మనం అనుభవించే శ్రమలను పోలిస్తే, ఇప్పటి శ్రమలు ఎన్నదగినవి కావని తెలుసుకుంటాం మరియు ఆ శ్రమల ప్రాముఖ్యత తగ్గిపోగలదు.




"ఎవనికి యాకోబు దేవుడు సహాయుడగునో ఎవడు తన దేవుడైన యెహోవా మీద ఆశ పెట్టుకొనునో వాడు ధన్యుడు. కీర్త 146:5. ప్రభువు మనకు ఇద్దరు మనుష్యుల గురించి బోధించినాడు. బండ మీద గృహమును నిర్మించిన మనుష్యుడు మరియు ఇసుక మీద గృహమును నిర్మించిన మనుష్యుడు. ఫలితాలలో తేడా గమనించండి. దీవెన లేదా విపత్తు. సంతోషం లేదా విచారం. "నీతిమంతుల ఆశ సంతోషము పుట్టించును. భక్తిహీనుల ఆశ భంగమైపోవును." సామె 10:28. కొంతమంది ద్రాక్షరసము మరియు ఆహారముతో తమ హృదయాలను సంతోషపరచుకుంటారు. మరికొంతమంది ఆస్తులు మరియు అంతస్తులు సంపాదించు కొనుటలో తమ హృదయాలను సంతోషపరచుకుంటారు. మనమయితే పరలోకంలో మనకొరకు ఉంచబడిన గొప్పనిధినిబట్టి, అనగా ఈలోకంలోని దేనిద్వారానైనను

ప్రభావితం కాజాలని ఆ గోప్ప నిధినిబట్టి మన హృదయాలను ఆనందింపజేసుకుంటాం. పంట వైఫల్యంద్వారా ద్రాక్షరసంమరియు ఆహారం లేకుండాపోగలదు. ఆర్ధిక ఒడిదుడుకులను బట్టి ఆస్తులు అంతస్తులు మారిపోవచ్చు. కాని, పరలోకమందున్న మన నిధి త్రుప్పు పట్టేదికాదు మరియు చిమటలు తిని వేసేది కాదు మరియు దొంగల ద్వారా దోచబడేది కాదు మరియు విఛ్చిన్నమై పోయేదికాదు. పెను తుఫాను గాలులలో ప్రభువుపై లంగరు




వేసిన మనలను ప్రజలు గమనిస్తుంటారు గదా? ఈ లోకవాసుల కంటే భిన్నంగా ఉన్న మనలను ప్రజలు గమనిస్తుంటారు గదా? “ మరియు మీ మనో నేత్రములు వెలిగింపబడినందున ఆయన మిమ్మును పిలిచిన పిలుపు వల్లనైన నిరీక్షణ యెట్టిదో, పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో ఎఫెస్సి 1:18. మానవ మాటలద్వారా కేవలం పాక్షికంగా మాత్రమే వివరించగల ఆ గొప్ప పరలోక నిధి, ఆ మానవ మాటలను పూర్తిగా అధిగమించి, ఈ నిధిని పూర్తిగా వివరించగల దేవుని వాక్యముమీద పూర్తిగా మన దృష్టియుంచుదము గాక.

**తీవ్ర వరద ప్రవాహంలో ప్రభువుయొక్క ఒడంబడిక, ఆయన నిబంధన మరియు ఆయన రక్తము నాకు మద్ధతు ఇచ్చుచున్నది.**
**ఈ లోకసబంధమైనది ఏమార్గముకూడా నాకు సాయపడని సమయంలో ఆయన మాత్రమే నా సమస్త నివాసము నా నిరీక్షణ**
**నేను నిలబడింది, క్రీస్తుఅను బండమీద, మిగతాదంతా మునిగిపోయే ఇసుక నేల. టి.ఎల్.హెచ్ 370 చరణం 3.**

## వాగ్దానము: (Promise)

“ఆయన ప్రమాణం, ఆయన నిబంధన మరియు రక్తం”, ఈ మూడు కూడా మన నిరీక్షణ అను సత్యాన్ని నిరూపించే సాక్ష్యాలు. దేవుని వాక్యము స్థిరమైన బండ అని మనకు ఖచ్చితమైన హామి ఇచ్చునవి ఆయన యొక్క ప్రమాణం మరియు నిబంధన. “ఈ విధముగా దేవుడు తన సంకల్పము నిశ్చలమైనదని ఆ వాగ్దానమునకు వారసులైనవారికి మరి నిశ్చయముగా కనుపరచవలెనని ఉద్ధేశించినవాడై, తాను అబద్ధమాడజాలని నిశ్చలమైన రెండు సంగతులను బట్టి, మనయెదుట ఉంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణాగతులమైన మనకుబలమైన ధైర్యము కలుగునట్లు ప్రమాణముచేసి వాగ్దానమును దృఢపరచెను.” హెబ్రీ 6:17-18. అంతేకాకుండా మనహృదయాల మీద శాశ్వతంగా ముద్రించబడిన శిలువ కూడా మనకు వాగ్దానం చేస్తున్నది.



దేవుని దగ్గరనుండి సంతాన వాగ్దానం పొందిన అబ్రహాం గురించి ఆలోచించండి. అబ్రహాము మరియు శారాల యొక్క వయస్సు మొదలగు ఇతరత్రా అటంకాలను అధిగమించిన దేవుని వాగ్దానమిది. వాగ్దానము చేసినదేవుడు ఖచ్చితంగా తన వాగ్దానాన్ని నెరవేరుస్తాడని అబ్రహాము నిరీక్షించాడు. వాగ్దానం ఫలించి పుట్టిన తన వాగ్దాన పుత్రుని బలి అర్పించమన్న దేవుని ఆజ్ఞను గూర్చి ఆలోచించండి. అయినా అబ్రహాము తన కుమారుని బలి అర్పించుటకు ఏమాత్రము వెనుకాడలేదు. కారణం,దేవుడు తనకుమారుని మృతులలోనుండి లేపుటకుకూడా సమర్ధుడని అబ్రహాము నమ్మాడు. దేవుడు చేసిన భూలోక సంబంధమైన వాగ్దానలను దేవుడు ఖచ్చితంగా నెరవేరుస్తాడని అబ్రహాము నిరీక్షించాడు. అందువలన దేవుడు తన వాక్యం ద్వారా మనకు హామీ ఇవ్వబడిన పరలోక సంబంధమైన వాగ్దానాలన్ని కూడా నెరవేరుస్తాడని మన మందరం కూడా నమ్ముచున్నాము.

ఈ క్రింది కొన్ని ఉదాహరణలలోని అంచనాలను పరిశీలిద్దాం.

○ నీకొక ఉత్తరం పంపబడినదని తెలియ చేయబడినది. నమ్మకంగా ఆ ఉత్తరాన్ని తీసుకొనివచ్చే ఆ వ్యక్తి కొరకు మీరు చూస్తుంటారు. అదేవిధంగా దేవుని విషయంలోకూడా. అంతిమంగా దేవుడు మనకు అందించు వాగ్దానాలను ఆపడానికి ఏ జోక్యం ఉండదు.

○ మీ బ్యాంకు ఖాతాలో కొండ డబ్బు జమ జేయబడిదని మీకు తెలియజేయబడింది. దానిని నమ్మడానికి మీరు బ్యాంకులోనికి వెళ్ళి ఆ డబ్బును చూడనవసరంలేదు. కారణం మీ ఖాతా పుస్తకంలో ఆ వివరాలు నమోదు చేయబడినవి కనుక. అదేవిధంగా మనకు అనుగ్రహించబడిన పరలోక నిధులను మనం పరలోకం వెళ్ళి చూడనవసరంలేదు. అవి మనవేనని దేవుని వాక్యం ద్వారా హామి ఇవ్వబడినది. దేవుని పుస్తకంలో నమోదుచేయబడిన వివరాలలో జోక్యం చేసుకునే ఎటువంటి పొరపాట్లు ఉండవు. కారణం దేవుడు చేసేది దేవునికి తెలుసు.

○ మీకు డబ్బు ఇవ్వవలసిన ఒక వ్యక్తి డబ్బుకు బదులుగా చెక్కు వ్రాసి ఇచ్చి దానిని బ్యాంకులో వేస్తే వారు ఆ చెక్కులో వ్రాయబడినంత డబ్బు ఇస్తారని చెప్పాడు. అనగా చెక్ అనేది దాదాపుగా డబ్బుతో సమానం. మీరు చెక్కులో వాస్తవ డబ్బును చూడలేకపోయినా ఆ చెక్ ద్వారా డబ్బు వస్తుందని మీకు తెలును. అదేవిధంగా దేవుని ద్వారా వాగ్దానంచేయబడిన ఆ పరలోక నిధి మీదని చెప్పి మీకివ్వబడిన చెక్ దేవుని వాక్యం. ఇక ఇందులో ఎటువంటి పొరపాట్లుకూడా ఉండవు. ఎందుకనగా దేవుడు నమ్మకమైనవాడు.

కొంతమంది లేఖనాలను చదువుతారు గాని వాటియందు నమ్మకముంచరు కారణం వారి దృష్టిలో అవి కేవలనం మృతమైన అక్షరాలు మాత్రమే. మనకు రాబోవు వాటి విషయమై సంచకరువుగా ఉన్న పరిశుద్ధాత్ముడు మన హృదయాలలో ఉన్నాడు. "మీరును సత్యవాక్యమును, అనగామీరక్షణ సువార్తనువిని, క్రీస్తునందు విశ్వాసము వుంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి. దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన తన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు. " ఎఫెస్సీ 1: 13-14. దేవుడే స్వయంగా పరిశుద్ధాత్మద్వారా మన హృదయాలలో పనిచేస్తుంటాడు. ఆయన జీవించు ఆత్మయై యున్నాడు. దేవుడు పరిశుద్ధాత్మతో ఐక్యమై మన హృదయాలలో ఒక మర్మమైన విధానంలో పనిచేస్తున్నాడు. ఆయన చేసే పని ద్వారా, "మన ప్రభువగు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక. మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుట వలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు, అనగా అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిది యునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు, ఆయన తన విశేష కనికరము చొప్పన మనలను మరల జన్మింపజేసెను." 1 పేతురు 1:13-14. కాబట్టి, దేవుని వాగ్దానాలు శూన్యమైనవి కావు మరియు జీవములేనివి కావు కాని, పూర్తిగా సఫలీకృతమయ్యే దేవుని సజీవమైన హామీ అది. దేవుని వాగ్దానాలను అంటిపెట్టుకొని ఉండువారు ఏమాత్రము దీనిని సందేహించరు. మన భవిష్యత్తు ప్రకాశవంతమైనది మరియు అద్భుత మహిమకరమైనది.




పరలోకంగురించి సంక్షిప్త సంగ్రహావలోకనం: "అందువలన వారుదేవుని సింహాసనము ఎదుటఉండి రాత్రింబగళ్ళు ఆయన ఆలయంలో ఆయనను సేవించుచున్నారు. సింహాసనాసీనుడైన వాడు తానే తన గుడారమును వారిమీద కప్పును. వారికిఇకమీదట ఆకలియైనను దాహమైనను ఉండదు, సూర్యుని ఎండయైనను ఏ వడగాలియైనను వారికి తగులదు, ఏలయనగా సింహాసనం మధ్య మందుండు గొఱ్ఱెపిల్ల వారికి కాపరియై, జీవ జలముల బుగ్గల యొద్దకు వారిని నడిపించును, దేవుడే వారి కన్నులనుండి ప్రతి బాష్ప బిందువును తుడిచి వేయును." ప్రకటన 7: 15-17. ఆయన తన బూర శబ్దముతో వచ్చునప్పుడు, మహిమగల సింహాసము ముందు నేను నిలబడుటకు ఆయన ముందు ఎటువంటి దోషము లేకుండా నీతి వస్త్రములు ధరించుకొని నేను సిద్ధంగా ఉండే దృశ్యం, ఓహ్ ఎంత అద్భుతం!



**నేను నిలబడింది, క్రీస్తుఅను బండమీద,**
**మిగతాదంతా మునిగిపోయే ఇసుక నేల. టి.ఎల్.హెచ్ 370 చరణం 4.**

## సహనము: (Patience)

ఓపిక ఉంటే అన్ని సాధించవచ్చు. దీనిని సాధించుట గురించి దేవుడు సెలవిచ్చిన కొన్ని వచనభాగాలను చదవండి.

- "వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణవిషయమై మనమొప్పుకొనినది నిశ్చలముగా పట్టుకొందము." హెబ్రీ 10:23 . మనము ఆధారపడవలసినది మన స్వంతబలం మీద కాదుగాని నమ్మకమైన దేవుని మీద స్థిరముగా మనము ఆధారపడాలి.
- "అనగా మహాదేవుడును, మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షతకొరకు ఎదురు చూచుచు, ఈ లోకములో స్వస్థబుద్ధితోను నీతితోను భక్తితోను బ్రదుకుచుండవలెను. " తీతు 2:13. తన ఖచ్చితమైన వాగ్దానము చొప్పన ప్రభువైన యేసు క్రీస్తు మరణించి తిరిగిలేచాడు గనుక ఆయన మీద మన నిరీక్షణ యుంచినట్లయిన అది ఖచ్చితంగా నెరవేర్చబడుతుంది.
- "మూర్ఖతయు తిరుగుబాటునుగల ఆతరమును పోలియుండకయు వారుఆయన ఆజ్ఞలను గైకొనునట్లును." కీర్తనలు 78:7. దేవుడు సృష్టించిన 6 దినముల సృష్టిని చూడండి మరియు దేవుని నోటనుండి ఒకసారి మాట బయటకు వచ్చినప్పుడు అది ఖచ్చితంగా జరిగి తీరుతుంది.

ఆయన రాకడకొరకు మరియు మీదేహములు మహిమ దేహములగా మార్చబడబోవు ఆ దినము కొరకు మీరు సహనముగా ఎదురు చూస్తున్నారు, అపోస్తలుడైన పౌలు చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకుందాం. "ఇదివరకే నేను గెలిచితిననియైనను, ఇదివరకే సంపూర్ణ సిద్ధి పొందితిననియైనను నేను అనుకొనుటలేదుగాని, నేను దేని నిమిత్తము క్రీస్తు యేసుచేత పట్టబడితినో దానిని పట్టుకొన వలెనని పరుగెత్తు చున్నాను. సహోదరులారా, నేనిదివరకే పట్టుకొని యున్నానని తలంచుకొనను. అయితే ఒకటి చేయుచున్నాను, వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తు

యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురియొద్దకే పరుగెత్తుచున్నాను. కాబట్టి మనలోసంపూర్ణులమైన వారమందరము ఈ తాత్పర్యము కలిగియున్న యెడల, అదియు దేవుడు మీకు బయలుపరచును.” ఫిలిప్పీ 3:12-17. మీవెనుక ఉన్నవాటిని మీరు మరచిపోతున్నారా లేదా? అనుదిన చెడును మీ మనస్సులోనికి తీసుకొని ఆ దిగులును రేపటిదినము లోనికి తీసుకొని రాకండి. గురియొద్దకు మీరు పరుగెత్తుచున్నారా లేదా? పరుగుపందెంలో ఉన్నవారు పరధ్యానంతో ఉండకూడదు. గమ్యం మీదే వారి దృష్టి ఉండాలి. నీకొరకు ఉంచబడిన బహుమానాన్ని గురించి ఆలచించండి. ఆ బహుమతి మీద మీపేరు వ్రాయబడి ఉన్నది కనుక దానిని మీరు స్వతం చేసుకొనవచ్చు. ఎవరు కూడా మీయొద్దనుండి దానిని కాజేయలేరు. ఇది ఒక ఖచ్చితమైన విషయం.




ఈ లోకంలో కొందమంది ఉద్యోగులు తమ విధినిర్వహణలో వచ్చు జీతంలోనుండి కొంతభాగాన్ని ప్రభుత్వం దగ్గర దాచి పదవివిరమణ ఆయిన తరువాత పింఛను రూపంలో దాచిన డబ్బును పొందుకుంటూ తమ జీవితానికి  కావలసిన రూపంలో దానిని  వాడుకుంటూ ఉంటారు.  అయితే కొంతమంది ముందు చూపులేక డబ్బు మదుపు చేయలేక అనగా డబ్బును పొదుపుగా ఖర్చుచేయకుండా దుబారా ఖర్చుచేసి చివరి దశలో ఇబ్బందులు పడుతూఉంటారు. పెట్టుబడులు లేకపోవడంతో ఆదాయం వచ్చుమార్గాలు తగ్గిపోయి చివరిదశలో కష్టాలు పడుతుంటారు.  అయితే మనకొరకు పరలోకంలో ఒక సమృద్ధి యైన అద్భుత నిధి ఉంచబడింది అదిఎన్నటికి తగ్గిపోయేది కాదు. మనకు పరిపూర్ణమైన ఆనందం ఉంది. ఈ లోకంలో మనం అనుభవిస్తున్న సమస్త బాధలు, శ్రమలు అన్ని కూడా తొలగి పోయి, ఎన్నటికి తీసివేయబడలేని ముగింపులేని ఆనందం మనకొరకు ఏర్పాటు చేయబడిఉంది. మనకొరకు మహిమ ఉంది. పరలోక సింహాసనంపై మన దృష్టి. మరియు ఈ లోకం లోని  ఈతిబాధలన్నిటి నుండి  కూడా మన శరీరం విముక్తి పొందుకొని, మహిమ శరీరాలు ధరించుకొని, అనగా  సంపూర్ణస్థితిపై దృష్టి  పెడదాం. మనకు స్థలం సిద్ధంచేయుటకొరకు మనకంటే ముందుగా యేసు వెళ్ళి యున్నాడు. ఆయనతో కూడా మనమందరము పరలోకంలో ఉండగలం. గొప్ప అంచనాలతో ఆ సమయంకొరకు ఓపికతో నేను ఎదురు చూస్తాను.



**శోధన ఎంత ఉధృతంగా నామీదకు వచ్చినా, పరలోకమే నా గృహం**
**ఈలోక యాత్ర నాకు చిన్నది కారణం పరలోకమే నాగృహం**
**భయంకరమైన గాలి తుఫాను సమయం ఎదురైనా అవన్ని గతించిపోవునవే**
**చివరికి నేను నాఇంటిని చేరుకుంటాను, పరలోకమే నా గృహం**

**నా రక్షకుని సన్నిధికి చేరుకుంటాను పరలోకమే నా గృహం**
**నేను మహిమ పరచబడతాను, పరలోకమే నా గృహం**
**అక్కడ మంచివి గొప్పవి ఉన్నాయి, ఆ శ్రేష్టమైనవాటిని నేను ప్రేమిస్తాను**
**అక్కడ నేను కూడా విశ్రాంతి పొందుతాను, పరలోకమే నా గృహం. టి.ఎల్.హెచ్ 660 చరణం 162**

రెవ. డేవిడ్ కీని
**Rev. David Koenig**

IMMANUEL BIBLE COLLEGE
NIDUBROLU